క్లుప్తంగా

భూమిపూజ

కోట: మండలంలోని తిమ్మనాయుడుపాళెంలో ఉన్న భ్రమరాంబ సమేత సంతకాళహస్తీశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. రమేష్‌శెట్టి, ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వై మధుసూదన్‌రెడ్డి, ఆనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

పెళ్లకూరు: పాఠశాలల అభివృద్ధికి చాగణం లలిత మ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్టు కృషి చేస్తుందని ఆ ట్రస్టు ప్రతినిధి హృషీకేశవరావు అన్నారు. శుక్రవారం పెళ్లకూరు ప్రభుత్వ పాఠశాలకు వంట పాత్రలు, మిక్సీ, గ్రైండర్, తదితర వంట పాత్రలతో పాటు విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా చేతులు మీదుగా ఉచితంగా అందజేశారు. హెచ్ఎం వెంకటేశ్వరు పాల్గొన్నారు.

వెంకన్నను తాకిన సూర్యకిరణాలు

నాయుడుపేటటౌన్: తిమ్మాజికండ్రిగ సమీపంలోని అభయ అనుగ్రహ వేంకటేశ్వర స్వామి ఆలయ గర్భగుడిలో స్వామివారి విగ్రహాన్ని శుక్రవారం ఉదయం సూర్య కిరణాలు తాకా యి. అభిషేక పూజల సమయంలో చోటు చేసుకున్న ఈ సంఘటనతో వేద పండితులు తన్మాయత్వానికి గురయ్యారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

నాయుడుపేట: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం గణిత ఉపాధ్యాయులకు డిజిటల్ విధానం..బోధన పద్ధతులపై (సిమిలేషన్), ఇస్తున్న శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ డీఈఓ శివప్రకాష్ రెడ్డి పర్యవేక్షించారు.

దేశ ప్రగతి బీజేపీతోనే సాధ్యం


పుష్పగుచ్ఛం అందజేస్తున్న దయాకర్

చిల్లకూరు: బీజేపీ ప్రభుత్వంతోనే దేశప్రగతి సాధ్యమని కే దయాకర్ అన్నారు. శుక్రవారం ఆయన విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఆయన ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు.

చేపల చెరువు వేలం నేడు

ఓజిలి: మండలంలోని మాచవరం సచివాలయంలో చేపల చెరువు వేలం పాటలు శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు జరుగుతుందని ఈఓపీఆర్డీ మోహన్ తెలిపారు.

రైతుల అభ్యున్నతే జగనన్న లక్ష్యం


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవయ్య

పెళ్లకూరు: రైతుల అభ్యున్నతే సీఎం జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని, మెట్టప్రాంత రైతులకు కూడా చివరి తడి వరకు సాగు నీరందించి వారంతా సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శుక్రవారం ఎన్‌డీసీసీబీ చైర్మన్ కే సత్యనారాయణరెడ్డితో కలిసి చెంబేడు, పునబాక, అర్ధమాల, ఆర్లపాడు, చెన్నప్పనాయుడుపేట గ్రామాల రైతులతో మాట్లాడారు. చివరి తడికి సాగునీటి ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే రైతులతో కలిసి తెలుగుగంగ జలాలను 7వ బ్రాంచ్ కాలువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ ఆనందంగా జీవించాలనే దృక్పథంతోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, వాటి ద్వారా రాయితీపై విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు అందించడంతో పాటు గిట్టుబాటు ధరపై ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. మారుమూల గ్రామాల్లోని మెట్ట ప్రాంత భూములకు సాగునీరు అందించి పంటలను కాపాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఓ వెంకటరత్నం, నాయకులు లింగమనాయుడు, కృష్ణయ్య, మునిరాజ పాల్గొన్నారు.

ఎలుకలు నివారించుకోవాలి

చిల్లకూరు: రైతులు వరి పొలాల్లో ఎలుకలను సామూహికంగా నివారించాలని ఏఓ భవాని సూచించారు. మండలంలోని ఉడతావారిపాళెంలో శుక్రవారం సామూహికంగా ఎలుకలను ఎలా నివారించుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వరి దిగుబడి వచ్చే సరికే ఎలుకలు ఎక్కువైతే ధాన్యం తిని వేస్తాయన్నారు. వీటిని నివారించేందుకు ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా ఎలుకల నివారణకు మందును ఉచితంగా అందిస్తుందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సురక్ష పేదలకు వరం


మాట్లాడుతున్న సర్పంచ్ వరప్రసాద్‌రాజు

సైదాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష పేదల పాలిట వరమని లింగసముద్రం సర్పంచ్ వరప్రసాద్‌రాజు అన్నారు. మండలంలోని లింగసముద్రం సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులను కూడా ఉచితంగా అందజేస్తుందన్నారు. ఎంపీడీఓ శివకుమార్, జనార్దన్, శ్రావణి, మధు, పోలయ్య, సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ వేగవంతం చేయండి

దొరవారిసత్రం: మండలంలోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ వేగవంతంగా చేయాలని ఎంపీడీఓ శివరాజు తెలిపారు. శుక్రవారం కొత్తపల్లె, పూలతోట సచివాలయాలను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పనులు త్వరగా పూర్తి చేసేలా అన్ని చర్యలను సంబంధిత వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తీసుకోవాలని తెలి పారు. ఆయన వెంట ఏఓ రఘురామయ్య ఉన్నారు.

రక్తదానం

వాకాడు: మండలంలోని తూపిలిలో శుక్రవారం విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సుమారు 200 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఏ నవీన్, కార్తీక్, మాధవ్, సన్నీ, పవన్, సర్పంచ్ మధురెడ్డి, నాయకులు కే దామోదర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ధర్మప్రచార వారోత్సవాలు


ధర్మప్రచార వారోత్సవంలో పాల్గొన్న భక్తులు

సూళ్లూరుపేట: సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు సూళ్లూరుపేట పట్టణంలో జనవరి 26 నుంచి చేపట్టిన ధర్మ ప్రచారవారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ డీ బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సూళ్లూరుపేట, తడ మండలాల్లోని పలు ఆలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. సూళ్లూరుపేట పట్టణంలోని రుక్మిణీ సమేత పాండురంగా స్వామి ఆలయం, మద్వేకంట రామమూర్తుల ఆలయంలో ఈ కార్యక్రమాలను నిర్వహించి, గురువారం రాత్రి చెంగాళమ్మ ఆలయంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత గోపూజ చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్టించి కుంకుమార్చన నిర్వహించారు. ఈఓ శ్రీనివాసులురెడ్డి, పాలకమండలి సభ్యులు ఎం చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేయాలి

సైదాపురం: ఆరోగ్యశ్రీ కార్డులు ప్రతి ఇంటి పంపిణీ చేయాలని డీఎల్‌డీఓ వసుమతి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ సిబ్బంది, ఏఎన్‌ఎంతో సమీక్షించారు. ఎంపీడీఓ శివకుమార్, ఈఓపీఆర్డీ ఏడుకొండలు పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు

తడ: ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన తడ మండలం జట్లను శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. జిల్లాస్థాయి పోటీల్లో పురుషుల విభాగం కబడ్డీలో ద్వితీయ స్థానం, మహిళ విభాగంలో తృతీయ స్థానం సాధించారు. అలాగే మహిళల క్రికెట్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. ఈ జట్ల సభ్యులను ఎంపీపీ కే రఘురెడ్డి, ఎంపీడీఓ ఆమోసుబాబు, ఈఓపీఆర్‌డీ విజయ్‌కుమార్ అభినందించి, సత్కరించారు.

వైభవంగా కుంభాభిషేకం

నాయుడుపేటటౌన్: మండలంలోని చిగురుపాడు ఎస్టీ కాలనీలో నిర్మించిన మారెమ్మ ఆలయ కుంభాభిషేక వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక హోమాలు చేశారు. అనంతరం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేకం జరిపారు. హైదరాబాద్‌కు చెందిన దాత మాజీ ఎమ్మెల్సీ సీ సుధాకర్‌రావు, వీణ దంపతులతో పాటు పలువురు ఆలయ నిర్మాణానికి సహకరించినట్లు నిర్వాహకులు తెలిపారు.

సస్యరక్షణ చర్యలుచేపట్టాలి

వెంకటగిరిరూరల్: వరి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ సహాయక సంచాలకులు డాక్టర్ ధనంజయ్యరెడ్డి, ఏడీఏ నాగార్జునసాగర్ పేర్కొన్నారు. మండలంలోని యాలతూరు ఆర్బీకేలో శుక్రవారం పంట సాగులో సస్యరక్షణ చర్యలు, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఏఓ సుజాత, ఏఈఓ రా మ్మోహన్, గోపీకృష్ణ, సీఈఓ ప్రసాద్ పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత


నియామక పత్రాలు అందుకున్న అంగన్‌వాడీ సిబ్బందితో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

రాపూరు: అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలో నూతనంగా నియమితులైన హెల్పర్లకు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి శుక్రవారం నియామక పత్రాలను అందజేసినట్లు సీడీపీఓ సునందన తెలిపారు. ఆమె మాట్లాడుతూ వెంకటగిరిలోని నేదురుమల్లి బంగ్లాలో హెల్పర్లగా నియమితులైన రాపూరు బీసీ, సిద్ధవరం 2, కలువాయి మండలం చవటపల్లె అంగనవాడీ సహాయకులకు పత్రాలు అందజేశారని చెప్పారు. చిత్తశుద్ధితో విధులు నిర్వమించాలని సూచించారు.

తెలుగు గంగ నీటిని విడుదల చేయండి


తెలుగుగంగ చీఫ్ ఇంజినీర్‌తో మాట్లాడుతున్న మేరిగ మరళీధర్

చిల్లకూరు(చిట్టమూరు): చిట్టమూరు మండలంలో జనవరి ముందే భూగర్భజలాలలో అడుగంటిపోయి బోర్లలో బురద నీరు వస్తుందని, ఈ నేపథ్యంలో తెలుగు గంగ నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ సమన్వకర్త మేరిగ మురళీధర్ కోరారు. తిరుపతిలో శుక్రవారం చిట్టమూరు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన నాయకులతో కలసి తెలుగుగంగ చీఫ్ ఇంజినీర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ చిట్టమూరు మండలంలో తాగునీటికి ఒనరుగా ఉండే స్వర్ణముఖి నదిలో నీటి లభ్యత తగ్గి పోవడంతో చిట్టమూరు మండలంలోని పలు గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటిపోయాయన్నారు. దీంతో బోర్లలో బురదనీరు వస్తున్నాయని, ఈ నేపథ్యంలో ఆ నీరు తాగడానికి పనికిరాలేదని, దీంతో మండల ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తెలుగు గంగ కాలువల ద్వారా మండలాని తాగునీటిని విడుదల చేయాలని కోరారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తక్షణమే తాగునీటిని విడుదల చేసి, మండల ప్రజల దాహార్తిని తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన సీఈ మాట్లాడుతూ నీటి విడుదల విషయంలో సర్వే పూర్తి చేయించి, విడుదల చేసేలా చర్యలు చేపడతామని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి, నాయకులు డీ శేషరెడ్డి, బాబురెడ్డి, రాజారెడ్డి, అశ్విన్‌రెడ్డి ఉన్నారు.

మంత్రి పర్యటన విజయవంతం చేయండి

నాయుడుపేటటౌన్: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కే సుధాకర్ రెడ్డి కోరారు. మేనకూరులో మంత్రి పర్యటన ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి పలు ప్రారంభోత్సవాలు చేస్తారన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే వెంకట రమణారెడ్డి, కే కమలాకర్ రెడ్డి, సర్పంచ్ సురేష్, షేక్ రఫీ, ఎన్ కస్తూరయ్య ఎం సుబ్బారావు యాదవ్ ఉన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు


సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

పెళ్లకూరు: ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు విధి నిర్వహణలో అలసత్వం వద్దని, బాధ్యతగా పని చేయాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణలో జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో 825 పనులకు సంబంధించి పలు అంశాలను పరిశీలించారు. 9,097 జాబ్‌కార్డులపై రూ.3.74 కోట్లతో పనులు చేయించినట్లు చెప్పారు. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు సక్రమంగా పనులు చేపట్టకుండా, రికార్డులు పొందుపరలేదన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఎఫ్‌ఏలను తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తున్నట్లు చెప్పారు. మొత్తం రూ.1,83,580 రికవరీకి చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ రవికుమార్‌నాయుడు, అంబుడ్స్‌మెన్ రసరాయ నాయుడు, విజిలెన్స్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఎంపీడీఓ సురేష్‌బాబు, ఏపీఓ దయానంద్ పాల్గొన్నారు.